క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తం అవసరం



మాట్లాడుతున్న ఏఎస్ఐ మునికృష్ణ

కార్వేటినగరం : సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ మునికృష్ణ పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోషల్ మీడియా, సైబర్ బెదిరింపులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ.. రోజు రోజుకు దేశంలో సైబర్ బాధితులు ఎక్కువతున్నారని, తద్వారా యువత ఆత్మ నూన్యత, అలాగే కుంగుబాటుకు లోనవుతారని తెలియజేశారు. సోషల్ మీడియాలో వేదికగా వ్యక్తిగతంగా దుష్ప్రచారం, దూషణలు చేయడం, అవాస్తవాలను ప్రచారం చేసే వారు క్రిమినల్ కేసులు ఎదుర్కొవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి మాట్లాడుతూ.. అపరిచిత ఫోన్‌కాల్స్, మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో మారుపేర్లతో సైబర్ నేరాలకు పాల్పడుతున్న వారిని గుర్తించడం సాధ్యమని తెలియజేశారు. విద్యార్థులందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీఓ తనిఖీ



తహసీల్దార్‌తో చర్చిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

గంగాధర నెల్లూరు : తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చే వినతులు ఎన్నిరోజుల్లో పరిష్కరిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా మండలంలోని వరత్తూరులోని గంగమ్మ గుడికి వెళ్లే దారి విషయంపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత కోదండ రెడ్డి అభ్యంతర వ్యక్తం చేయడాన్ని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన వరత్తూరులో గంగమ్మ గుడి దారి తగాదా సమస్యని దర్యాప్తు చేసి పరిశీలించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్ , డీటీ తులసిరామ్, వీఆర్వోలు సుబ్రహ్మణ్యం, ఫాతిమా , సర్వేయర్ రమణ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ శుద్ధజలమే లక్ష్యం



గ్రామస్తులతో మాట్లాడుతున్న జలజీవన్ మిషన్ అధికారులు

శ్రీరంగరాజపురం : మండలంలో జరిగిన జాతీయ జలజీవన్ మిషన్‌కు సంబంధించిన పనులను కేంద్ర ప్రభుత్వ అధికారులు మంగళవారం పుళ్లూరు, కాపు కండ్రిగ గ్రామాల్లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నేషనల్ వాష్ నిపుణులు ప్రదీప్ మాట్లాడుతూ.. జలజీవన్ మిషన్ పనుల ద్వారా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యమన్నారు. స్థానిక అధికారులు జలజీవన్ మిషన్ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అనంతరం జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రజలకు అందుతున్న లబ్ధిని గ్రామస్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. కార్యక్రమానికి డీఈ సతీష్‌కుమార్, ఈఈ నరేంద్రకుమార్, జేజేఎం జిల్లా అధికారులు, ఎంపీడీఓ మోహన్‌మురళి, ఏఈ కుమార్‌స్వామి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు

నగరి : నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న మినీ అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు ఆర్డీవో భవానీశంకరి ఆధ్వర్యంలో మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. నగరి మండలం గురండాజుకుప్పం దళితవాడలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు, బుగ్గ అగ్రహారంలో హెల్పర్ పోస్టు, నింద్ర మండలం శ్రీరామాపురంలో మినీ కార్యకర్త పోస్టుకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 3 పోస్టులకు గాను అయిదుగురు హాజరయ్యారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి హైమావతి, నగరి అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు ఎయిల్అరసన్, సీడీపీవోలు కృష్ణవేణి, జయంతి, ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేశారు. కార్యాలయ అధికారులు కరుణాకర్‌రెడ్డి, సుకన్య, శ్రీహరి పాల్గొన్నారు.

పరీక్షలతో గొళ్లెం.. కేన్సర్‌కు కళ్లెం



విజయపురంలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

కేన్సర్ మహమ్మారి ప్రస్తుతం చాపకింద నీరులా విస్తరిస్తోంది. జాతీయ కుటుంబ ఆరోగ్యశాఖ సర్వే ప్రకారం కేన్సర్‌ను ఆలస్యంగా గుర్తించడం వల్ల అధిక మరణాలు సంభవిస్తున్నాయి. ఈ మహమ్మారిని ఎదుర్కోవాలంటే ముందస్తుగా కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయిస్తే ప్రాథమిక దశలోనే లక్షణాలు గుర్తించడం ద్వారా కేన్సర్ మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

- కేన్సర్ గుర్తింపునకు ఇంటింటి సర్వే
- 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ స్క్రీనింగ్ పరీక్షలు
- గర్భాశయ, రొమ్ము కేన్సర్‌ను గుర్తించే ప్రయత్నం
- పాఠశాలలు, అంగన్‌వాడీల్లోనూ సర్వే

నగరి : మహిళల్లో పలు రకాల కేన్సర్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని వారికి అవగాహన కల్పించి పరీక్షలు నిర్వహించాలని వైద్యులు చెబుతున్నారు. ఈ మహమ్మారిని అరికట్టేందుకు ఆరోగ్యశాఖ



ముడిపల్లి అంగన్‌వాడీలో ఆరోగ్య పరీక్షలు

ప్రత్యేక దృష్టి సారించింది. కేన్సర్‌పై విజయం.. స్క్రీనింగ్‌తో సాధ్యం‌ కార్యక్రమం పేరిట ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. సమాచారాన్ని నిక్షిప్తం చేయడానికి వైద్యారోగ్యశాఖ ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఇందుకోసం ఆరోగ్యశాఖ సిబ్బందికి శిక్షణ సైతం ఇచ్చారు. ఇంటింటికీ వెళ్లి నిర్వహిస్తున్న సర్వేను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి 18 ఏళ్లు నిండిన వారికి పలు రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

స్క్రీనింగ్‌తో కనుగొనే ప్రయత్నం

ఒక వ్యక్తిలో కేన్సర్ కణాల కోసం శోధించడాన్నే స్క్రీనింగ్ అని పిలుస్తారు. ఆ వ్యక్తిలో కేన్సర్ ప్రభావిత లక్షణాలు ఉన్నాయో లేదో ఆరోగ్యశాఖ సిబ్బంది పరిశీలించి కేన్సర్ పరీక్షలు నిర్వహిస్తారు. ముందస్తు రోగ నిర్ధారణకు ఈ పరీక్షలు దోహదం చేస్తాయి. ప్రస్తుతం గ్రామాల్లో ఆయుష్మాన్ భారత్ సమగ్ర ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వ్యక్తిగత వివరాలతో పాటు దీర్ఘకాలిక వ్యాధులు గాని, మరే ఇతర వ్యాధులు గాని ఉన్నాయేమో వైద్య సిబ్బంది ఆరా తీస్తారు. గతంలో సంక్రమించిన వ్యాధుల వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. చెడు అలవాట్లపై ఆరా తీస్తారు. మహిళల్లో సంక్రమించే గర్భాశయ కేన్సర్, రొమ్ము కేన్సర్ లక్షణాలను సైతం గుర్తిస్తారు.

సర్వే విధానం ఇలా..

ప్రతి ఇంటి వద్దకు ఆరోగ్యశాఖ సిబ్బంది వెళ్లి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని యాప్ ద్వారా వివరాలు అప్‌లోడ్ చేస్తారు. దంత సమస్యలు నమోదు చేయడంతో కేన్సర్ దశను ప్రాథమిక అంచనా వేస్తారు. ప్రజలకు కేన్సర్ స్క్రీనింగ్‌పై ముందుగా అవగాహన కల్పిస్తారు.

సర్వేకి సహకరించాలి



కేన్సర్ నిర్ధారణ పరీక్షలపై ఎలాంటి అపోహలు వద్దు. స్క్రీనింగ్‌తో ముందస్తుగా కేన్సర్ లక్షణాలను గుర్తించవచ్చు. ఎక్కువగా మహిళలు గర్భాశయ, రొమ్ము కేన్సర్లతో బాధ పడుతున్నారు. ఈ పరీక్షలతో సత్ఫలితాలు పొందవచ్చు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సిబ్బంది సర్వేకు సహకరించి పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్ రమేష్, మెడికల్ ఆఫీసర్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, బుగ్గఅగ్రహారం

లింగ వివక్ష చూపడం నేరం

పాలసముద్రం : లింగ వివక్ష చూపడం, బాల్యవివాహం, గృహహింస చట్టరీత్యా నేరమని ఐకేపీ ఏపీఎం కల్పలత పేర్కొన్నారు. మంగళవారం ఐకేపీ కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏపీఎం కల్పలత మాట్లాడుతూ.. స్త్రీలు, పురుషులు సమానమని, లింగ వివక్ష చూపకూడదని, బాల్యవివాహాలు చేయడం నేరమన్నారు. పురుషులతో సమానంగా స్త్రీలను చదివించాలన్నారు. ప్రతి అమ్మాయి విద్యావేత్తగా ఎదగాలని కోరుతూ మహిళల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఐకేపీ కార్యాలయం నుంచి పాలసముద్రం వరకు స్వయం సహాయక మహిళలతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సీసీ లోకనాథం, సంఘమిత్ర మురగయ్య పాల్గొన్నారు.



లింగ వివక్షకు వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న మహిళా సంఘం సభ్యులు

ఘనంగా ఉత్తరా నక్షత్ర పూజలు

నగరి : పట్టణ పరిధి బైపాస్ కూడలి సమీపంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామి జన్మ నక్షత్రమైన ఉత్తరా నక్షత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప భజనలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా ఆలయంలోని భక్తులకు సహపంక్తి భోజనం పెట్టారు. పార్థిభన్ ఆచారి ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో భక్తులు కన్నప్ప, మునస్వామి, ఎల్లప్పరెడ్డి, రమేష్ బాబు, సురేష్, దుర్గాప్రకాష్ స్వామి పాల్గొన్నారు.

వెదురుకుప్పం : మండలంలోని పచ్చికాపల్లం రాయల మండపంలో ఉన్న వినాయక స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామికి ఘనంగా జ్యోతి పూజలు చేశారు. అనంతరం గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.



సహపంక్తి భోజనం చేస్తున్న భక్తులు

ఆకట్టుకున్న నమూనా పార్లమెంట్



మాక్ పార్లమెంట్ నిర్వహిస్తున్న విద్యార్థులు

నగరి : మండలంలోని ఎం.కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలోని 9,10 తరగతి విద్యార్థులు మంగళవారం నిర్వహించిన నమూనా పార్లమెంట్ అందరినీ ఆకట్టుకుంది. పాఠశాలలోని టేబుళ్లకు మంత్రుల శాఖలను అంటించి ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులుగా పార్లమెంట్‌లో ఏ నిర్ణయాలు తీసుకుంటారో చేసి చూపడం అందరినీ అబ్బురపరిచింది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గీతాకుమార్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు హిమావతి, మునిరత్నం, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుద్దాం

శ్రీరంగరాజపురం : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఎంపీడీఓ మోహన్ మురళి అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. అంబేడ్కర్ కృషి ఫలితమే నేడు భారత రాజ్యాంగ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ప్రజాస్వామ్యానికి రాజ్యాంగం మూలస్తంభమన్నారు. అనంతరం భారత రాజ్యాంగ ప్రవేశ పీఠికను చదివి, ప్రజాప్రతినిధులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు.

శాస్త్రోక్తంగా సుదర్శన హోమం

తవణంపల్లె: కార్తీక మాసం సందర్భంగా మండలంలోని టీ.పుత్తూరు కోదండ రామాలయంలో మంగళవారం హనుమంతునికి విశేష పూజలు, హోమాలు చేశారు. ఉదయం ఆలయంలో సీతారాముల సమేత లక్ష్మణులకు వేదపండితులు శాస్త్రోక్తంగా అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేసి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం పుష్కరిణి వద్ద కొలువుదీరిన ఆంజనేయస్వామి విగ్రహం వద్ద సుదర్శన యాగం, సుదర్శన హోమం నిర్వహించారు. సాయంత్రం పుష్పయాగానికి అంకురార్పణం చేశారు. బుధవారం పుష్ప యాగం నిర్వహిస్తామని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి తెలిపారు.

వైభవంగా హనుమంతుని వాహనసేవ

రాత్రి హనుమంతుని వాహనసేవ నిర్వహించారు. ఉభయదారులు పూజాసామగ్రి, పుష్పాలను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామికి సమర్పించారు. వేద పండితులు ఉత్సవమూర్తులైన సీతారామ లక్ష్మణులు, ఆంజనేయస్వామికి పూజార్చన అనంతరం హనుమంత వాహనంపై సీతారామ లక్ష్మణులు కొలువుదీరి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.



ఆంజనేయస్వామికి చేస్తున్న సుదర్శన యాగం, హోమాలు

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 22 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 22 మందికి రూ.2.20 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి మంగళవారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు రెండు రోజులుగా వాహనాల తనిఖీ చేశారు. పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 22 మందిపై కేసు నమోదుచేసి కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

ఉద్యోగుల హక్కుల కోసం పోరాడతాం



ఉద్యోగులతో మాట్లాడుతున్న పూర్ణం

చిత్తూరు కార్పొరేషన్: ఉద్యోగుల హక్కుల కోసం రాజీలేని పోరాటాలు చేస్తామని వాణిజ్య పన్నులశాఖ సర్వీసెస్ అసోసియేషన్ చిత్తూరు డివిజన్ అధ్యక్షుడు పూర్ణం అన్నారు. మంగళవారం వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయాల భవనం ఆవరణలో భోజన విరామ సమయంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు అందరూ కృషి చేయాలన్నారు. ఐక్యంగా పోరాటాలు చేస్తే సమస్యలు పరిష్కారం అవుతుందన్నారు. హక్కుల అమలు కోసం అందరూ సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గిరిధర్, ప్రసాద్‌రెడ్డి, సుబ్రమణ్యం, కృష్ణమూర్తి, జగదీష్, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఫసల్ బీమాను సద్వినియోగం చేసుకోండి

నగరి : ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డివిజనల్ వ్యవసాయ అధికారి సౌభాగ్యమ్మ, వ్యవసాయ అధికారి రాఘవేంద్ర యాదవ్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఫసల్ బీమాలో రబీ సీజన్‌కు వరి, వేరుశనగ పంటలను గుర్తించడం జరిగిందన్నారు. వరి పంటకు గ్రామాన్ని యూనిట్, వేరుశనగ పంటకు మండలాన్ని యూనిట్‌గా పరిగణిస్తారన్నారు. టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా ఈ బీమా చేయడం జరుగుతుందన్నారు. వీటికి సంబంధిత ఏజెన్సీ రైతులకు అందుబాటులో ఉంటుందన్నారు. వరి పంటకు ఎకరాకు రైతు బీమాగా రూ.84 చెల్లిస్తే పంట నష్టం జరిగితే రూ.42 వేలు పరిహారంగా ఇస్తారన్నారు. వేరుశనగ పంటకు రైతు బీమాగా రూ.60 చెల్లిస్తే పరిహారంగా రూ.30 వేలు వస్తుందన్నారు. వేరుశనగ పంటకు ఈ నెల 15వ తేదీ లోపు, వరి పంటకు డిసెంబరు 31లోపు బీమా చెల్లించాల్సి ఉంటుందన్నారు. నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్‌లో గానీ, రబీ 2024–25 పోర్టల్‌లో గానీ నమోదు చేసుకోవచ్చన్నారు.

తుపాను హెచ్చరికలతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నగరి : తుపాన్ నేపథ్యంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి ఈనెల 29వ వరకు భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. ఈ కంట్రోల్ రూమ్ నుంచి పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేపడుతామన్నారు. బుధవారం తెరణి వీఆర్‌ఓ చంద్రశేఖర్, దామరపాకం వీఆర్‌ఏ సుబ్రమణ్యం కంట్రోల్ రూమ్‌లో ఉంటారని 98664 98516 నంబరుకు , 27వ తేదీన ఏకాంబరకుప్పం వీఆర్వో గోవిందరెడ్డి, ఓజీ కుప్పం వీఆర్‌ఏ అయ్యప్ప 94933 17125 నంబరుకు , 28వ తేదీన కాకవేడు వీఆర్‌ఓ ప్రభాకర్, మాంగాడు వీఆర్‌ఏ బాబు కంట్రోల్ రూమ్‌లో ఉంటారని వారిని 97046 23597 ఈ నంబరుకు , 29వ తేదీన బీరకుప్పం వీఆర్‌ఓ వెంకటపతి, ఓజీ కుప్పం వీఆర్‌ఏ అయ్యప్ప ఉంటారని వారిని 63053 12141 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. వర్షాల కారణంగా ఎక్కడ ఏ అవాంతరాలు జరిగినా కంట్రోల్ రూమ్ నంబర్లను సంప్రదించాలన్నారు.

రాజ్యాంగ హక్కులను కాపాడాలి

శ్రీరంగరాజపురం : భారత రాజ్యాంగ హక్కులు, విలువలను కాపాడాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కుప్పయ్య అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండల కార్యాలయం వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో భారత రాజ్యాంగం అమలు కావడం లేదని, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని ఆరోపించారు. హామీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నిస్తే అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారన్నారని విమర్శించారు. భావ ప్రకటన హక్కుకు రాష్ట్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తోందన్నారు. కార్యక్రమానికి మండల కన్వీనర్ మణి, ఎంపీపీ సరితాజనార్దన్, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కాలప్ప, నాయకులు బాబు, ఆనంద్, కరుణాకర్, జయ, ఉమాపతి, మోహన్, యోగనందం, బాబు, గోవిందయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారులతో హెచ్‌ఎం కేశవులు, ఉపాధ్యాయులు

కార్వేటినగరం : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని డీఎం పురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కేశవులు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సాఫ్ట్‌బాల్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సాయికిరణ్, పావనిసాయిని మంగళవారం హెచ్‌ఎం కేశవులు అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. అనంతరం రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ పొన్న యుగంధర్ మాట్లాడుతూ..జాతీయ క్రీడాకారులను ఆదర్శంగా తీసుకుని పాఠశాల నుంచి ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలన్నారు. విద్యార్థులను క్రీడా రంగంలో రాణించే విధంగా తర్ఫీదు ఇస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుమల రాజును అభినందించారు. ఈ క్రమంలో సాఫ్ట్‌బాల్ రాష్ట్ర స్థాయి జట్టుకు ప్రాతినిధ్యం వహించిన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరిత, సరస్వతి, మాలతి, సుమతి, సుబ్రహ్మణ్యంరెడ్డి, వెంకట రమణయ్య, ఢిల్లీబాబు, రంజిత్‌కుమార్, రాములు, హరిప్రకాష్ పాల్గొన్నారు.

28న మామిడి రైతుల సదస్సు

తవణంపల్లె: మండలంలోని మామిడి రైతులకు 28వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు అరగొండ గౌరీ శంకర కల్యాణ మండపంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మండల ఉద్యానవన శాఖాధికారిణి సాగరిక తెలిపారు. మామిడి తోటలో పూత, పిందె దశలో తీసుకోవాల్సిన సస్యరక్షణ పద్ధతులపై ఉద్యానవన శాఖ, వైఎస్సార్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారన్నారు. దీనిని మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాజ్యాంగం ప్రజల జీవనాడి

నగరి : భారత రాజ్యాంగం ప్రజల జీవనాడని నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. వేణుగోపాల్ పేర్కొన్నారు. కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ విభాగాలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూ కోఆర్డినేటర్ డా.ఇందిరా ప్రియదర్శిని, జంతుశాస్త్ర విభాగం అధిపతి సుబ్రహ్మణ్యం, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ డా.భాస్కర్, జేకేసీ కోఆర్డినేటర్ డా. పంకజ, డా.రేవతి, అకడమిక్ కోఆర్డినేటర్ డా. మహేశ్వరీ,ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- బస్టాండు ప్రాంగణంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఎస్పీ, జేబీఎస్, ఏపీఎల్‌ఎఫ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఆర్.బాబు, జేబీఎస్ రాష్ట్రనాయకులు పవర్‌రామచంద్రన్, ఏపీఎల్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సాధన శేఖర్, బహుజన సీనియర్ నాయకులు నాగరత్నం, కుమార్, రవి, సత్తార్ భాష, పాల్గొన్నారు.

పుత్తూరు : స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం మేళవించిందే భారత రాజ్యాంగమని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి జయప్రసాద్, అధ్యాపకులు అమ్ముదేవి, రమాదేవి, రాజరత్నం, చక్రధర్, కుసుమ, రాజి, మధు, మాలతి, అపరంజి, అలివేలమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే ఎస్ఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్నిప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ వీరయ్య, అధ్యాపకులు నాగేశ్వరరావు, శ్రీనివాసులు, బాబురావు, విద్యార్థులు పాల్గొన్నారు.



నగరి : అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బహుజన నేతలు



వెదురుకుప్పం : అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

వెదురుకుప్పం : రాజ్యాంగం మన దేశానికి దిక్సూచి లాంటిదని జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ పేర్కొన్నారు. భారత రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వెదురుకుప్పంలోని అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెదురుకుప్పం సర్పంచి శిల్ప, జేసీఎస్ కన్వీనర్ బట్టే సుబ్రహ్మణ్యం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పేట ధనుంజేయులురెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, మాజీ సర్పంచ్‌లు పెద్దిరెడ్డి, చిన్నబ్బరెడ్డి, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ మునికృష్ణా రెడ్డి, సీనియర్ నాయకుడు బొజ్జారెడ్డి, ఎస్సీ నాయకులు పొన్నయ్య, ధర్మయ్య, వెంకటముని, జక్కదన బాబు, వెంకటాచలం, వడివేలు, అనిల్ పాల్గొన్నారు. అలాగే చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని ప్రిన్సిపల్ అన్నపూర్ణశారద ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఐక్యూసీ కోఆర్డినేటర్ వెంకటేష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్వేటినగరం : ఆర్కేఎస్సార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ స్వరూప మాట్లాడుతూ.. 2015 నుంచి ఏటా నవంబర్ 26న జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీ అయితే ఈ ఏడాది 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కమలాకర్‌రెడ్డి , మాధవనాయుడు, లక్ష్మీరమణకుమారి, రాజేష్ కుమార్, నారాయణస్వామి, నరసింహరావు, సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలసముద్రం : ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడిన విద్యను అలవర్చుకుంటే సమాజంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఎంపీడీఓ క్రిష్ణమహేష్ రెడ్డి తెలిపారు. మంగళవారం పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రిన్సిపల్ హేమలత ఆధ్వర్యంలో రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. అనంతరం రాజ్యాంగం గురించి మాట్లాడిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు , విద్యార్థులు పాల్గొన్నారు

విజయపురం : భారత రాజ్యాంగం మహోన్నతమైనదని ఎంపీడీవో రమణప్రకాష్ అన్నారు. మంగళవారం స్థానిక మండల కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా జరుపుకొన్నారు. ముందుగా అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి స్వీట్లు పంపిణీ చేశారు.

గంగాధర నెల్లూరు : గంగాధర నెల్లూరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీడీవో హరి ప్రసాద్ రెడ్డి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.